# నేటి ప్రస్థానం
తెలుగు దిన పత్రిక
APTEL/2013/54506


## ఉగ్రదాడి
కాశ్మీర్‌లో పెట్రేగిన ముష్కరులు
కాల్పుల్లో 27మంది పర్యాటకులు మృతి
మరో 20మంది పరిస్థితి విషమం
హిందు పర్యాటకులే లక్ష్యంగా దారుణం 4


ఎడిటర్: ఐతగోని రాఘవేంద్ర | బుధవారం, 23 ఏప్రిల్ 2025 | సంపుటి: 12 | సంచిక: 39 | పేజీలు: 4 | వెల:10/-


### నిజాలను నిర్భయంగా ప్రచురిస్తున్న
### నేటి ప్రస్థానం యాజమాన్యానికి
# అభినందనలు
ఎంపీ ఈటల రాజేందర్



**నేటి ప్రస్థానం, వనస్థలిపురం:** నిజాలను నిర్భయంగా రాస్తున్న నేటి ప్రస్థానం దినపత్రిక టీంకు అభినందనలు తెలియజేస్తున్నానని ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. ఎంపీ ఈటెల రాజేందర్ ను శామీర్ పేట లోని ఆయన నివాసంలో హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ-జీవన్ రెడ్డితో కలిసి నేటి ప్రస్థాన దినపత్రిక చైర్మన్ ఐతగోని రాఘవేంద్ర మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నేటి ప్రస్థానం దినపత్రికను చదివినా ఎంపీ రాజకీయ కోణం లో కాకుండా ప్రజా కోణంలో వార్తలు అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి పార్టీకో పత్రిక, ప్రతి నాయకునికి ఓ మీడియా ఛానల్ పుట్టుకొస్తున్న ఈ తరుణంలో ఆర్జీవి మీడియా, నేటి ప్రస్థానం దినపత్రిక ప్రజా సమస్యలను ప్రతిబింబించేలాగా ప్రతి అక్షరాన్ని మలవడం శుభసూచకమన్నారు. ప్రజాక్షేత్రంలో నిలవాలంటే నికార్సైన

మిగతా 2 లో




- నీరు గారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- ఐదేళ్లు అవుతున్నా పేదల చెంతకు చేరని వైద్యం
- గోలీలు లేవు.. వైద్యులు కనిపించరు
- చాలా చోట్ల దవాఖానల మూత
- సమస్యల వలయంలో బస్తీ దవాఖానలు
- ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న నిరు పేదలు

## బస్తీ దవాఖానకు
# సుస్తీ
### పేదలకు అందని ప్రాథమిక ఆరోగ్య సేవలు

తెలంగాణ ప్రభుత్వం నగరాల్లోని పేద ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రవేశపెట్టిన 'బస్తీ దవాఖానలు' పేదల్లో ఆశలు నింపాయి. ప్రధాన ఆసుపత్రులకు వెళ్లి క్యూ కట్టే బాధ తప్పుతుందని, తమ గల్లీలోనే డాక్టర్ ఉంటాడని ఎంతోమంది మురిసిపోయారు. అయితే, వాస్తవం మాత్రం మరోలా ఉంది. బస్తీ దవాఖానలను ప్రారంభించి ఐదేళ్లు దాటుతున్నా ఈ పథకం మాత్రం పేదల చెంతకు పూర్తిగా చేరడం లేదు.

- హైదరాబాద్, నేటి ప్రస్థానం

02











## నేటి ప్రస్థానం యాజమాన్యానికి
# అభినందనలు

మొదటి పేజీ తరువాయి

వార్తలు అందించడం ఎంతైనా అవసరమన్నారు. నాయకుకులకు, పార్టీ లకు కొమ్ము కాయకుండా నిజాలను మాత్రమే ప్రచురించాలని తెలిపారు. ఎంపీ ని కలిసిన వారిలో బిజెపి సీనియర్ నాయకులు సిరంగి సురేష్ కుమార్, నేటి ప్రస్థానం రిపోర్టర్లు ఉన్నారు.

### ప్రజల కోసం పనిచేసే వ్యక్తి జీవన్ రెడ్డి : ఎంపీ ఈటల రాజేందర్

ప్రజా సమస్యల కోసం పరితపించే వ్యక్తి హైత్ నగర్ కార్పొరేటర్ కళ్యాణ్ నవజీవన్ రెడ్డి అని ఎంపీ ఈటెల రాజేందర్ కితాబిచ్చారు. ఎంపీ ఈటల రాజేందర్ ను శామీర్ పేట లోని తన నివాసంలో మంగళవారం కార్పొరేటర్ కలిశారు. కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కాలనీ సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు.

# బస్తీ దవాఖానకు సుస్తీ

(హైదరాబాద్, నేటి ప్రస్థానం)



ఒక్కో నగరంలో వేలాది మంది పేద ప్రజలు జీవిస్తున్న పరిస్థితుల్లో, కనీస వైద్యసేవలు వారికి అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం బస్తీ దవాఖానల్ని ఏర్పాటు చేసింది. తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ, జీహెచ్ఎంసీ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ దవాఖానాను 2018 ఏప్రిల్ 6న అప్పటి మంత్రి కె. తారక రామారావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. తక్కువ ఖర్చులో మంచి వైద్యం, రెగ్యులర్ చెకప్‌లు, మెటర్నిటీ సేవలు సహా మొత్తం 57 రకాల సేవల్ని ఒకే చోట ఉండేలా చూడాలని ప్రభుత్వం సంకల్పించింది. కానీ, వాస్తవం మాత్రం మరోలా ఉంది. బస్తీ దవాఖానల్లో ఒక వైద్యుడు, స్టాఫ్ నర్స్, నర్సు నిత్యం అందుబాటులో ఉండాలి. కానీ, వారెవరూ సమయానికి రారు. ఉదయం 9 గంటలకే రావాల్సిన వైద్యుడు 10.30 గంటలు అయినా కనిపించడు. అసలు వస్తారో రారో తెలియదు. చాలా చోట్ల బస్తీ దవాఖానలకు తాళాలు దర్శనమి స్తున్నాయి. కొన్నిచోట్ల సిబ్బంది ఉన్నా రోగులను పట్టించు కోరు. మరికొన్ని దవాఖానల్లో సిబ్బంది లేకపోవడం, క్వాలిఫైడ్ నర్సులు అందుబాటులో లేకపోవడం, స్కానింగ్, టెస్టింగ్ వంటి సదుపాయాలేమీ లేకపోవడం వంటి సమ స్యలు అడుగడుగునా కనిపిస్తున్నాయి. దవాఖానకు వచ్చి బీపీ, షుగర్ చెక్ చేయించుకుంటే మందులు రాస్తారని, కానీ, మందుల కోసం కౌంటర్ వద్దకు వెళ్తే 'రేపు రా' అంటారని ముషీరాబాద్ బస్తీ నివాసి రజిత ఆవేదన వ్య క్తం చేశారు. బస్తీ దవాఖానాల్లో వారంలో ఒక రోజు మాత్రమే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, పరీక్షలు చేసేందుకు సరైన సదుపాయాలు లేకపోవడంతో పేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని ఎల్బీనగర్‌కు చెందిన సీనియర్ సిటిజన్ రామచంద్రయ్య తెలిపారు.

### అందించాల్సిన సేవలు

నిజానికి బస్తీ దవాఖానాల్లో 57 రకాల వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. అలాగే, ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఓపీ అందుబాటులో ఉండాలి. 200 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, 145 రకాల మందులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. సాధారణ జ్వరం, దగ్గు, షుగర్, బీపీతోపాటు నిత్యం 80 నుంచి 100 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయాలి. తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ల ద్వారా నిత్యం 30 మందికి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించాలి. గర్భిణులకు 9 నెలలపాటు పరీక్షలు చేయాలి. క్యాల్షియం, ఐరన్ మందులివ్వాలి. థైరాయిడ్ సమస్యలు గుర్తించి ప్రసవం సులభంగా జరిగేలా సలహాలు, సూచనలివ్వాలి. ప్రతి బుధ, శనివారాల్లో చిన్నారులకు పోలియో, టీటీ, డీపీటీ టీకాలు వేయాలి. అంతేకాదు, టెలీమెడిసిన్ సేవలు కూడా అందించాలి. అయితే, ఇవన్నీ కాగితాల్లోనే తప్ప వాస్తవంగా ప్రజలకు అందుబాటులో లేవని బస్తీ ప్రజలు చెబుతున్నారు. రోగులకు వైద్య పరీక్షలు, మందులు అందజేత వంటి వాటిని రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. అనంతరం 3 గంటలలోపు ఈ ప్రక్రియను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ సరైన డేటా ఎంట్రీ సిబ్బంది, సరిపడా నర్సులు మాత్రం కానరావడం లేదు. దీంతో ఉన్న ఒకరిద్దరు సిబ్బందితోనే ఈ ప్రక్రియనంతా పూర్తి చేయడంతో పని భారం అధికమై ఒత్తిడికి లోనవుతున్నారు. డేటా ఎంట్రీ సిబ్బంది, ఎక్కువ నర్సులను నియమిస్తే ఉన్న సిబ్బందికి భారం తగ్గనుంది.

### వేతనాల సమస్య

బస్తీ దవాఖానల్లో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు ఎక్కువశాతం రోజువారీ కాంట్రాక్టుల మీద పనిచేస్తున్నారు. జీతాలు ఆలస్యం, పనిభారం అధికంగా ఉండడం వల్ల కొందరు మధ్యలోనే వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. మరికొందరు రెండు బస్తీ దవాఖానల్లో షిఫ్టులు చేస్తూ ఏమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు.

### అరకొరగా మందులు


బస్తీ దవాఖానాలకు వచ్చే రోగులకు మందులు సరిగ్గా అందుబాటులో ఉండడం లేదు. ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 2–3 బస్తీ దవాఖానాల నిర్వహణను చూస్తుంది. నెలకు సరిపడా మందులు ఒకేసారి ఇస్తుంటారు. బస్తీ దావాఖానాలకు వచ్చే రోగుల సంఖ్యకు పీహెచ్‌సీ అందించే మందులకు పొంతన లేకుండా పోతుంది. ప్రభుత్వం అందజేస్తున్న మందులు కేవలం 15 రోజులకు మాత్రమే సరిపోతున్నాయని మిగతా రోజుల్లో స్థానికంగా ఉన్న పీహెచ్‌సీలకు వెళ్లి తీసుకోవాలని చెప్తున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పలుమార్లు రోగుల సహాయకులకు, బస్తీ దవాఖాన సిబ్బందికి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంటోంది. రోగులకు సరిపడా మందులు లేన్నప్పుడు బస్తీ దవాఖానాలను ఎందుకు నిర్వహిస్తున్నారని ఘర్షణలకు దిగుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి.

### ప్రభుత్వం ఏమంటోంది?

ప్రభుత్వం చెప్తున్న దాని ప్రకారం ఒక్క హైదరాబాద్‌లోనే 300కి పైగా బస్తీ దవాఖానలు కొనసాగుతున్నాయి. ఇవి మన ఆరోగ్య వ్యవస్థకు మద్దతుగా నిలుస్తున్నాయని, ప్రతి నెల వేలాది మందికి సేవలు అందిస్తున్నామని ఆరోగ్య శాఖ చెబుతోంది. కానీ, ఆయా సెంటర్లలో సందర్శించగా కనిపిస్తున్న వాస్తవాలు ప్రభుత్వం చెబుతున్నదానికి భిన్నంగా ఉన్నాయి. బస్తీ దవాఖానలు ఒక మంచి ఆలోచన. కానీ వాటిని నిరంతర పర్యవేక్షణ, సిబ్బంది భద్రత, వైద్య పరికరాల అందుబాటు లేకుండా నడిపించటం ప్రజల జీవనాన్ని మరింత ఆందోళనలోకి నెడుతోంది. ఆరోగ్యం ఒక హక్కు అయితే... బస్తీల్లో దాని కోసం ఇంకా పోరాటం కొనసాగుతూనే ఉంది.

# పుస్తకం ఓ నేస్తం

## "ప్రపంచ పుస్తక దినోత్సవం(ఏప్రిల్ 23 సందర్భంగా)



పుస్తకం ఓ మంచి నేస్తం. ఓ మంచి పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం అనుభవించే వాళ్ళకే తెలుస్తోంది. పుస్తకం అమ్మలా లాలిస్తుంది, నాన్నలా ఆదరిస్తుంది, గురువులా హితబోధ చేస్తుంది, ఒంటరితనంలో స్నేహితుడిలా అక్కున చేర్చుకుంటుంది, బాధపడే వారిని ఓదారుస్తుంది. మనిషిలో మానసిక పరివర్తనను తీసుకువస్తుంది. అలసిన మనసులకు సేద తీర్చుతుంది. అందుకే పుస్తకం అనితరమైన ఆయుధంగా,నేస్తంగా సమస్తంగా అన్ని తరాలవారినీ అలరిస్తోంది. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి దారి చూపెట్టే సాధనంగా దోహదపడుతుంది. మనోవికాసానికి, మార్గనిర్దేశానికి గురువులా ఉపయోగపడుతుంది. అందుకే జీవితంలో నిజమైన నేస్తం.. పుస్తకం. మానవజీవన గమనం, విధానంలో పుస్తకాలు వచ్చాక విప్లవాత్మక మార్పులు వచ్చాయంటే నమ్మాల్సిందే. ఆధునిక జీవన విధానం చుట్టుముడుతున్న ఈ రోజుల్లోనూ పుస్తక పఠనాన్ని ఇష్టపడేవారూ తగ్గలేదని యునెస్కో చెప్పింది. ప్రముఖ ఆంగ్ల రచయిత విలియం షేక్స్‌పియర్ వర్ధంతి సందర్భంగా ప్రతిఏటా ఏప్రిల్ 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని నిర్వహించాలని యునెస్కో నిర్ణయించింది. ఈ దినోత్సవాన్ని1995 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ రోజును కాపీ హక్కుల దినోత్సవంగా కూడా జరుపుకుంటారు. అదేవిధంగా ఈ రోజున ప్రపంచంలో ఒక ప్రముఖ నగరాన్ని ప్రపంచ పుస్తక రాజధానిగా ప్రకటిస్తారు. ఈ సంవత్సరం బ్రెజిల్ లోని రీడి జీనరో(Rio de Janeiro, Brazil) పట్టణాన్ని "పుస్తక రాజధాని"గా ప్రకటించడం జరిగింది. ఈ దినోత్సవాన్ని (Read Your Way) "మీ మార్గంలో చదవండి" అనే ఇతివృత్తంతో నిర్వహించుకోవడం జరుగుతోంది. కాలం ఎంత మారినా పుస్తక ప్రియులకు కొదవ లేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్ మొబైల్ లాంటి అనేక ఆధునిక సాంకేతికత సాధనాలు అందుబాటులోకి వచ్చిన పుస్తకం పఠనానికి ప్రత్యేకత ఉన్నది. పుస్తకాలు గొప్ప ఆలోచనకు పదును పెట్టి అనేక ఆవిష్కరణలు చేయడానికి తోడ్పడతాయి. మనుషులలో అజ్ఞానం ఛాయలు తొలగిపోయి విజ్ఞానం వైపు నడిపించే నావ ఓ మంచి పుస్తకం. "పుస్తకాలు మనో మాలిన్యాలను తొలగించి దీపాలు"అని భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ దేశ వాసులు ఎక్కువసేపు పుస్తకాలు చదువుతారానే విషయంపై ఓ అంతర్జాతీయ సర్వే నిర్వహించగా ఆ సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ప్రపంచంలో అందరికన్నా ఎక్కువ సేపు పుస్తకాలు చదివే వారు భారతీయులని ఆ సర్వే పేర్కొనడం హర్షించదగ్గ విషయం. నేటి డీజిటల్ యుగములో 71 శాతం ప్రజలు పుస్తకాలను డిజిటల్ సాధనాలపైనే, కేవలం 29 శాతం మాత్రమే ప్రత్యక్షంగా పుస్తకాలను చదువుతున్నారని పేర్కొనడం జరిగింది. డిజిటల్ యుగంలో పుస్తకాలు చదివే అలవాటులో కూడా విప్లవాత్మకమైన మార్పు వచ్చిందని చెప్పవచ్చు. ఒకప్పుడు మనుషులు ప్రయాణాలు చేస్తున్నప్పుడు, విశ్రాంతి సమయంలో చేతిలో పుస్తకం ఉండేది, కానీ నేడు ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఉండడమే దీనికి కారణమని చెప్పవచ్చు.

ప్రపంచంలో పుస్తక భాండాగారం గురించి తెలుసుకోవాలంటే మనదేశంలో కూడా ఐదు ప్రముఖ పుస్తక మార్కెట్లు ఉన్నాయి. ఇక్కడ కొత్త పుస్తకాలే కాదు పాత పుస్తకాలు మరెక్కడ దొరకని అరుదైన గ్రంథాలు లభిస్తాయి. అవి దేశ రాజధాని ఢిల్లీలో రెండు పుస్తక మార్కెట్లు ఉన్నాయి. దరియాగంజి, నైసాదక్ మార్కెట్లు ప్రసిద్ధి గాంచినవి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఉండే పుస్తక మార్కెట్ వారసత్వంగా వస్తున్న ఆస్తిగా పేర్కొంటారు. మనదేశంలో అతిపెద్ద పుస్తక మార్కెట్ ఇది. పూణెలోని అప్పా బల్వంత్ చౌక్‌లో ఉండే పుస్తక మార్కెట్‌లో ప్రపంచంలో విలువైన పుస్తకాలన్నీ లభ్యమవుతాయి. హైదరాబాద్‌లోని కోఠి కూడా విలువైన పుస్తకాలకు కేంద్రంగా ఉంది. ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసే, వ్యక్తిత్వ వికాసానికి పదునుపెట్టే పుస్తకాల్లోని ప్రతి అక్షరం జీవంతో తొణకిసలాడుతుందని మరువద్దు. పుస్తకాలను ఎంపిక చేసుకునేటపుడు సమకాలీన సమస్యలకు పరిష్కారాన్ని చూపిస్తూ మార్గనిర్దేశం చేసేవాటిని ఎంపిక చేసుకొని ఆనందమయ జీవితానికి యువత బాటలు వేసుకోవాలి. పుస్తకం మహాసముద్రంలాంటిది. అందుకే సంఘ సంస్కర్త కందుకూరు విరేశలింగం పంతులుగారు చిరిగిన చొక్క అయినా తొడుక్కోగానీ మంచి పుస్తకం కనుక్కో అని అన్నారు. కాని నేడు సాంకేతిక విజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న కొద్దీ ఇంటర్నెట్, వాట్సాప్ సంభాషణలతో పసి పిల్లాడి నుంచి పెద్దల వరకు విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారే గానీ ఎవ్వరూ కూడా మంచి పుస్తకం చదవటానికి మక్కువ చూపటం లేదు. చిన్నప్పటి నుంచి పిల్లల్లో కథలు పుస్తకాలు చదివే అలవాటు చేస్తే అదే అలవాటుగా మారి యు-వతరం అన్ని విషయాల్లో పోటీపడినట్లే పుస్తకాలు చదవటంలో పోటీపడతారు. మనిషి మేధస్సును విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతో దోహదపడతాయానడంలో సందేహం లేదు. ఒకసారి విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ తుదివరకు జీవితాన్ని నడిపిస్తుంది. పుస్తకాలు చదవడం అంటే మానవత్వాన్ని పంచుకోవడం. ఇతరుల జీవితాల్లోకి అడుగుపెట్టడానికి, వారి కళ్లతో ప్రపంచాన్ని చూడటానికి, వారితో సహానుభూతి చెందడానికి పుస్తక పఠనం వీలు కల్పిస్తుంది. మహోన్నత విజ్ఞానం అందించే పుస్తక జ్ఞానాన్ని ప్రతి ఒక్కరు అందిపుచ్చుకొని అజ్ఞానపు పొరలను తొలిగించుకోవాలి. అప్పుడే మనిషి ఉన్నత శిఖరాలను అధిరోహించుకోవడనికి అవకాశం ఉంటుంది. కావునా పుస్తకాలను చదవడం అలవాటుగా మార్చుకొని వాటి శక్తిని తెలుసుకోండి.

సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకుడు
7989579428





# పుడమి పుత్రిక రూపురెడ్డి లక్ష్మి





అబల.. కోమలి.. సుకుమారి అంటూ ఆడవారిని తక్కువచేసి చూసే రోజులు పోయాయి. వంటింటి నుంచి అంతరిక్షం వరకు ఏ రంగంలోనైన రాణించగలమని ఇప్పటికే ఎందరో మహిళలు నిరూపించుకున్నారు. నిరూపించుకుంటున్నారు కూడా. అన్ని రంగాల్లో.. ఎవ్వరికీ తాము తక్కువ కామని.. తమ శక్తిని సమాజానికి చాటిచెప్తున్నారు. పారిశ్రామికవేత్తలుగా, ఉద్యోగస్తులుగా, డ్రైవర్లుగా తాము ప్రతిభ కనపరచని రంగమంటూ లేదని తమ సత్తా చాటుతున్నారు. అయితే వీటన్నిటికీ భిన్నంగా వ్యవసాయ రంగంలో రాణిస్తూ అద్భుతాలు సృష్టిస్తోంది ఒక మహిళ. ఒక సాధారణ గృహిణిగా జీవితం మొదలు పెట్టిన ఆమె ఇప్పుడు రైతులకు సలహాలు ఇచ్చే స్థాయికి చేరింది. ఏ పంటకు ఏ మందులు వాడాలి. ఏ భూమిలో ఏ విత్తనాలు నాటాలి. ఇలా వ్యవసాయంలో తను ప్రయోగాలు చేస్తూనే తోటివారికి చెప్తూ అందరికీ ఆదర్శవంతంగా నిలుస్తున్నారు. అంతేకాదు వ్యవసాయంలో ఆమె చేసిన కృషికి గాను జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎన్నో అవార్డులు ఆమెకు దాసోహమయ్యాయి. ఆ మహిళనే రూపిరెడ్డి లక్ష్మి. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం కొండాపల్కల గ్రామానికి చెందిన రూపిరెడ్డి లక్ష్మిపెద్దగా చదువుకోకపోయిన ఇప్పుడు రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే ఎందరో అన్నదాతలకు ఆదర్శంగా నిలుస్తోంది.




## భర్త ప్రోత్సాహంతో..

వ్యవసాయ కుటుంబంలో పుట్టిన లక్ష్మి.. పెద్దగా చదువుకోలేదు. కానీ.. వ్యవసాయం అంటే మాత్రం అమితమైన ప్రేమ. అందుకే.. తమకున్న పొలంలో తన భర్తతో కలిసి వ్యవసాయం చేసింది. అయితే.. అందరిలా కాకుండా.. వినూత్న రీతిలో వ్యవసాయం చేసి అద్భుత ఫలితాలు సాధించింది. తన భర్త తిరుపతి రెడ్డి ప్రోత్సాహంతో వ్యవసాయం, సాగులో.. వెదజల్లే పద్ధతి పాటిస్తూ.. అధిక దిగుబడులు సాధించింది. ఆమె పాటించిన పద్ధతి.. సాధించి ఫలితాలు శాస్త్రవేత్తలను సైతం విస్మయ పరిచాయి. పొలం దున్నటం మొదలుకొని విత్తనాలు వెదజల్లి, కలుపు మొక్కలు తీసి, మందులు పిచికారి కొట్టడం, పండిన వరిని మార్కెట్ తరలించే వరకు అన్ని పనులు లక్ష్మి ఒక్కతే చేయడం విశేషం. ఇందుకోసం లక్ష్మి.. ట్రాక్టర్ నడపడంతో పాటు బైక్, కారు నడపటం కూడా నేర్చుకుంది. వ్యవసాయంలో ఖర్చులు తగ్గిస్తేనే లాభం. అందుకే ఖర్చు తగ్గించే పద్దతులపై దృష్టి పెట్టాను. ఎప్పుడైనా కొత్తగా చేసేటప్పుడు కొన్ని కష్టాలు ఉంటాయి, వాటిని ఎదిరించి నిలబడితేనే విజయం వశమవుతుంది. నారు పోయకుండా విత్తనం వెదజల్లితే ఎంతోమంది ఇదేం వ్యవసాయమన్నారు. కానీ, నాపై నాకు నమ్మకం ఉంది. నేను అర్థం చేసుకున్న పనులు ఐదేళ్లుగా చేస్తూనే ఉన్నాను. అధిక దిగుబడులు సాధిస్తూనే ఉన్నాను అంటారు లక్ష్మి.

## అధిక దిగుబడి

తాను చేస్తున్న కృషికి అవార్డులు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్న లక్ష్మి.. ఎప్పటి నుంచో వస్తోన్న రైతే రాజు అనే నానుడిని.. రైతే రాణిగా మార్చాలని ఆశయం పెట్టుకుంది. తన ఆశయం మరింత మంది మహిళా రైతులకు ఆదర్శం కావాలని లక్ష్మి ఆకాంక్షిస్తోంది. అయితే.. వెదజల్లే పద్ధతిన వరి పండించినప్పుడు.. లక్ష్మికి మొదట్లో అనుకున్నంత దిగుబడి రాలేదు. అయినా.. నిరుత్సాహపడలేదు. తన ప్రయత్నాన్ని ఆపలేదు. గ్రామంలో కూడా కొంతమంది రైతులు లక్ష్మి గురించి వెటకారంగా మాట్లాడారు. అయినప్పటికీ నిరుత్సాహ పడకుండా భర్త సహకారం అందించడంతో లక్ష్మి తిరిగి సాగులో వెదజల్లే పద్ధతిలో వ్యవసాయం చేయడం.. అధిక దిగుబడులు సాధించింది. అయితే వ్యవసాయంలో చేసే ప్రతి పనికి కృషి విజ్ఞాన కేంద్రం జమ్మికుంట శాస్త్ర వేత్తల పూర్తి సహాయ సహకారాలు ఉన్నాయి అని లక్ష్మి చెబుతోంది. ట్రాక్టర్‌తో పొలం దున్నడం నుంచి ధాన్యాన్ని మార్కెట్‌లో అమ్మేవరకు అన్ని పనుల్లోనూ లక్ష్మి స్వయంగా క్రియాశీలంగా పాల్గొంటారు. మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ, ప్రతి సీజన్‌లో 450%-%500 క్వింటాళ్ల ధాన్యం పండిస్తారు. సాధారణంగా రైతులు వరి నారు పోసి, పొలం దున్ని, జంబు (దమ్ము) చేసి, కూలీల చేత నాటు వేయిస్తుంటారు. లక్ష్మి మాత్రం వరి విత్తనాలు వెదజల్లి పంట పండిస్తున్నారు. ఈ పద్ధతిలో నాలుగైదు బస్తాలు ఎక్కువగా దిగుబడి తీస్తున్నారు.

## ఎకరానికి రూ.వేలల్లో ఖర్చు ఆదా

వానాకాలం పంటలో అయితే పొలం దున్నడం, నారు పోయడం, నాటు వేయడం మానుకొని.. పొలాన్ని దుక్కి చేసి, తడిపి వరి విత్తనాలను లక్ష్మి వెదజల్లుతారు. నెలకు నాలుగైదు సార్లు ఆరు తడి పంటగా నీళ్లు పెడుతుంటారు. మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నారు. రబీ సీజన్‌లో.. ట్రాక్టర్‌తో పొలం దున్ని, ఒక రోజు నానబెట్టి మొలక గట్టిన వరి విత్తనాలను పొలంలో వెదజల్లుతారు. ప్రధాన పొలంలో కొత్త మొలకవచ్చే వరకు వేచి చూసి, అవసరాన్ని బట్టి నీరు పెడుతుంటారు. కలుపు మందులు పిచికారీ చేస్తుంటారు. తాము అనుసరిస్తున్న మెరుగైన పద్ధతుల వల్ల ఎకరాకు రూ. 7%-%8 వేల వరకు ఖర్చు తగ్గిందని, 15 ఎకరాల్లో దాదాపు రూ. లక్ష వరకు ఖర్చు తగ్గిందని లక్ష్మి గర్వంగా చెపుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ సోనా వంటి సన్న రకాలు సాగు చేస్తే, రబీలో ఎంటియు%-%1010, ఐఆర్%-%64, జెజిఎల్%-%24423 వంటి రకాలు సాగు చేస్తారు. ముఖ్యంగా పొలంలో వరి పంట కోసిన తర్వాత మిగిలే కొయ్యకాళ్లను తగులబెట్టరు. దున్నేసి కంపోస్టుగా మారుస్తారు. జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పంటలు వేసి.. పూతకు రాగానే కలియదున్నుతున్నుతారు. దీంతో, పంటకు పెద్దగా పశువుల ఎరువు, కోళ్ల ఎరువు వంటివి వేయరు. అలాగే, రసాయన ఎరువులపై పెట్టే ఖర్చును వీలైనంతగా తగ్గించుకుంటున్నారు. గత ఐదేళ్ల నుంచి ఈ పద్ధతిలో సాగు చేస్తూ లక్ష్మి, తిరుపతి రెడ్డి దంపతులు తోటి రైతులకు ఆదర్శంగా నిలిచారు.

## జగ్జీవన్ రామ్ అభినవ జాతీయ పురస్కారం

వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇప్పటికే అనేక అవార్డులు, ప్రశంసా పత్రాలు లక్ష్మి అందుకుంది. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి 92 వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా 2019-20 సంవత్సరానికి %×జూ=% ప్రకటించిన జగ్జీవన్ రామ్ అభినవ జాతీయ పురస్కారం రూపురెడ్డి లక్ష్మికి దక్కడం ఆమె వ్యవసాయంలో చేసిన కృషికి ఫలితమే. అదే కాకుండా 2019 రాష్ట్ర స్థాయిలో రైతురత్న, యూనివర్సిటీ అఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ బెంగళూరు, ఇండియన్ సైన్సు కాంగ్రెస్ అసోసియేషన్ కలకత్తా వారు సంయుక్తంగా ఏర్పాటు చేసిన 107 ఇండియన్ సైన్సు కాంగ్రెస్ మహిళ రైతుగా రూపిరెడ్డి లక్ష్మి పాల్గొంది.



## విదేశీ శాస్త్రవేత్తలకు ఆదర్శంగా

ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల నుంచి వ్యవసాయ నిపుణులు అధికారులు రైతులు కొండపల్కలలోని లక్ష్మి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి ఆమె అనుసరిస్తున్న నూతన సాంకేతిక విధానాలను అడిగి తెలుసుకున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల వ్యవసాయ విద్యను అభ్యసిస్తోన్న విద్యార్థులు నేపాల్ దేశంలో విద్యను అభ్యసిస్తోన్న విద్యార్థులు సైతం ఆమె క్షేత్రంలో పర్యటించి వ్యవసాయ సాగు పద్ధతులు తెలుసుకున్నారు. గత సంవత్సరం చివర్లో జరిగిన ఢిల్లీలో జరిగిన జాతీయ కిసాన్ మేళ కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుంచి నలుగురు రైతులకు అవకాశం రాగా అందులో లక్ష్మి ఒక్కరే మహిళ రైతు కావడం విశేషం.

-మధుకర్ వైద్యుల

## జాతీయ స్థాయిలో గుర్తింపు..

ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరీలో కేంద్ర సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులకు వ్యవసాయం, సాంకేతికత, నూతన సాగుపై అవగాహన కల్పించడానికి తెలంగాణ నుంచి ఒక్క రూపిరెడ్డి లక్ష్మికి మాత్రమే ఆహ్వానం రాగా ఇంట్లో ఉన్న పరిస్థితుల కారణంగా తాను హాజరు కాలేకపోయింది. ఇలా ఒక మహిళ రైతు అనుకున్నది సాధించే వరకు అన్ని తానే అయి పనిచేస్తే గుర్తింపు తానంతట అదే వస్తుంది అని ఆ మహిళ రైతు లక్ష్మి చెప్తోంది. తాను నమ్మిన విధంగా వ్యవసాయ క్షేత్రంలో చేసిన కృషి ఫలితంగానే ఇప్పుడు ఆమె రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి సాధించాలని కోరుకుందాం.



నేటి ప్రస్థానం
తెలుగు దిన పత్రిక
APTEL/2013/54506
హైదరాబాద్
హైదరాబాద్
బుధవారం
23.04.2025





# మరోమారు అమ్మాయిల సత్తా

**తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల**

**ఫస్టియర్ ఫలితాల్లో 65.96 శాతం ఉత్తీర్ణత**

**సెకండియర్‌లో 65.65 శాతం ఉత్తీర్ణత నమోదు**

**ఫలితాలు విడుదల చేసిన మంత్రి భట్టి**

**హైదరాబాద్, నేటి ప్రస్థానం:** తెలంగాణ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో అమ్మాయిలు సత్తా చాటారు. ఫస్టియర్ ఫలితాల్లో 65.96 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 73.83 శాతం, బాలురు 57.83 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు 4,88,430 మంది హాజరు కాగా 3,22,191 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 65.65 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, బాలికలు 74.21 శాతం, బాలురు 57.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ పరీక్షలకు 5,08,582 మంది హాజరు కాగా, 3,33,908 మంది ఉత్తీర్ణత సాధించారు.మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫిలాలు విడదల చేశారు. గతం కన్నా ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఈ సారి ఇంటర్ ఫలితాలలో బాలికలదే హవా కొనసాగింది. 9.5 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. గత నెల 5 నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఇంటర్ ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మొత్తం 9.97లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఇక రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు సంబంధించిన వివరాలను ఇంటర్‌బోర్డు వెల్లడించింది. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో మేడ్చల్ జిల్లా 77.21 శాతంతో మొదటి స్థానంలో.. 48.43 శాతంతో మహబూబాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచాయి. ద్వితీయ సంవత్సరంలో ములుగు జిల్లా 80.12 శాతంతో టాప్‌లో ఉండగా.. కామారెడ్డి జిల్లా 54.93శాతంతో చివరి స్థానంలో నిలిచింది. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలను డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇంటర్ పాసైన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేసారు. భవిష్యత్‌లో కూడా విద్యార్థులంతా వారి ఉన్నత విద్య కోసం ఇంకా అడుగులు ముందుకు వేయాలని, వారి జీవితాల్లో అత్యుతన్నత స్థానాకలు ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నటలు వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా జపాన్ పర్యటనలో ఉండి.. వారు నా ద్వారా ఈ సందేశాన్ని ఇవ్వాలని ప్రత్యేకంగా చెప్పారు. విద్యార్థులందరికీ సీఎం రేవంత్ తరపున అభినందనలు.. వారి భవిష్యత్ కోసం విద్యాశాఖ నిరంతరం పని చేస్తుందని సీఎం స్పష్టంగా తెలియజేయాలని కోరారు. విద్యార్థులందరికీ దగ్గరుండి బోధించిన అధ్యాపకులకు, పారదర్శకంగా ఫలితాలు ప్రకటించిన బోర్డుకు హృదయపూర్వకమైన అభినందనలు తెలియజేస్తున్నాని తెలుపుతూ భట్టి తన ప్రసంగాన్ని ముగించారు. ఇంటర్ పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించామని బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. 19 కేంద్రాల్లో పేపర్ల వాల్యుయేషన్ చేపట్టామన్నారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు వారం గడువు ఇస్తున్నట్లు- చెప్పారు. మే 22 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. రీ వెరిఫికేషన్‌కు రూ.600, రీ కౌంటింగ్‌కు రూ.100 ఫీజుగా నిర్ణయించినట్లు చెప్పారు. ఏప్రిల్ 23 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్‌కు పేపర్‌కు రూ. 100 చొప్పున, రీవెరిఫికేషన్‌కు పేపర్‌కు రూ. 600 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఇదిలావుంటే ఇంటర్ పరీక్షల ఫలితాల విడుదల కోసం ముగ్గురు మంత్రులు రావడం, వారు కలిసి విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా విద్యాశాఖ మంత్రి ఇంటర్ ఫలితాలను విడుదల చేస్తారు. విద్యామంత్రి లేని కారణంగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క ఫలితాలు విడుదల చేస్తారని ముందే ప్రకటించారు. మంత్రి లేకుంటే ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి లేదా సంబంధింత ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఫలితాలను ప్రకటించడం ఆనవాయితీ. అయితే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం, మరో ఇద్దరు మంత్రులు కలిసి ఫలితాలను విడుదల చేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క ఇంటర్ పరీక్ష ఫలితాల కోసం ఇంత హంగామా అవసరమా అని అసహనం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ- సీఎం ఫలితాలను విడుదల చేస్తారని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. అది కూడా సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు అని చెప్పారు. కానీ డిప్యూటీ సీఎంతో పాటు ఇద్దరు మంత్రులు రావడం.. ఫలితాలను అర గంట ఆలస్యంగా విడుదల చేయడం అయోమయానికి గురి చేసింది.



# భారీ ఉగ్రదాడి

**కాశ్మీర్‌లో పెట్రేగిన ముష్కరులు**

**కాల్పుల్లో 27మంది పర్యాటకులు మృతి**

**మరో 20మంది పరిస్థితి విషమం**

**హిందు పర్యాటకులే లక్ష్యంగా దారుణం**



**నేటి ప్రస్థానం, శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. హిందూ పర్యాటకులు లక్ష్యంగా జరిపిన కాల్పుల్లో 27మంది బలయ్యారు. అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో పర్యటకులే లక్ష్యంగా దాడులకు తెగబ డ్డారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతం లో విహారానికి వచ్చిన వారిపై పాశవిక దాడికి పాల్పడ్డా రు. ఈ ఘటనలో 27 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో జమ్మూకశ్మీర్‌లో అతిపెద్ద ఉగ్ర ఘటన ఇదేనని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొ న్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతం లో బైసరన్ ప్రాంతంలో ఉన్న దాదాపు 40 మంది పర్య టకులను అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. అనంతరం విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. దీంతో కొంతమంది అక్కడికక్కడే కుప్పకూలగా.. అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. రక్తపు మడుగులో పడిఉన్న మృతదేహాలతో స్థానికంగా భీతావహ వాతావరణం నెలకొంది. తమ వారిని కాపాడాలంటూ పలువురు విజ్ఞప్తి చేస్తున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను తరలించడం కష్టమైంది. బైసరన్‌లో కాల్పుల శబ్దం వినిపించడంతో వెంటనే అప్రమత్తమైన భద్రతా బలగాలు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి తరలివెళ్లాయి. గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికులు గుర్రాల సాయంతో పలువురిని తీసుకెళ్లినట్లు సమాచారం. తొలుత మృతుల సంఖ్య తక్కువగానే ఉన్నట్లు పేర్కొన్నప్పటికీ.. ప్రస్తుతం 27కి చేరినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో మరికొందరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు.. కాల్పుల ఘటనతో పహల్గాం వీధులు నిర్మానుష్యంగా మారాయి. పర్యటకులు సైతం సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలిసింది. 38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3 నుంచి ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షల మంది యాత్రికులు రెండు మార్గాల్లో ఇక్కడకు చేరుకుంటారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కి.మీ మేర ఉండగా.. 14కి.మీ మార్గం గందేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో పర్యటకులపై ఉగ్రవాదులు దాడికి తెగబడటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఈ ఘటనపై ప్రధాని మోడీ హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడారు. అమిత్ షా ఉన్నతస్థాయి విచారణచేపట్టారు.

# వెళ్లి మోదీకి చెప్పండి

**కర్ణాటక టూరిస్టులపై పాశికంగా కాల్పులు**

**హిందువులే లక్ష్యంగా ఉగ్రదాడి**

**నేటి ప్రస్థానం, శ్రీనగర్:** జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో మంగళవారం ఉగ్రవాదులు టూరిస్టులను టార్గెట్ చేస్తూ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దాడిని ప్రధాని నరేంద్రమోడీ సహా అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్ ఖండించారు. దాడికి పాల్పడినవారిని ఖచ్చితంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని మోడీ ఆదేశాల మేరకు హోం మంత్రి అమిత్ షా ఘటనా స్థలానికి బయలుదేరారు. అయితే, పక్కా ప్లాన్ ప్రకారమే ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు టూరిస్టులపై దగ్గర నుంచి కాల్పులు జరిపారు. పేరు, మతం అడుగుతూ, ఐడెంటిటీ కార్డులు చెక్ చేస్తూ చంపేశారు. ఈ దాడికి సంబంధించిన భయంకరమైన నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన ఒక వ్యక్తిని కాల్చి చంపిన తర్వాత, టెర్రరిస్టులు అతడి భార్యతో మాట్లాడుతూ.. 'మోడీకి వెళ్లి ఈ విషయం చెప్పు' అని అన్నాడు. ప్రధాని మోడీని ఉద్దేశిస్తూ ఈ వ్యాఖ్యలు చేశాడు. శివమొగ్గకు చెందిన కుటుంబం సెలవుల్లో కాశ్మీర్ విహారయాత్రకు వెళ్లింది. మంజునాథ్ అతడి భార్య పల్లి, కొడుకుతో కాశ్మీర్ లోయకు వెళ్లారు. దాడికి సంబంధించిన విషయాలను పల్లవి వివరించారు. మేము ముగ్గురం - నేను, నా భర్త, మా కొడుకు - కాశ్మీర్‌కు వెళ్ళాము. ఇది మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో జరిగిందని నేను అనుకుంటున్నాను. మేము పహల్గామ్‌లో ఉన్నాము. అతను నా కళ్ళ ముందు అక్కడికక్కడే మరణించాడని కన్నీటి పర్యంతమైంది. ఇది ఇప్పటికీ చెడు కలలా ఉందని అన్నారు. దాడి జరిగిన వెంటను స్థానికులు తమకు సాయం చేయడానికి వచ్చారని పల్లవి చెప్పింది. తనను ముగ్గురు స్థానికులు రక్షించినట్లు చెప్పారు. దాడిలో హిందువుల్ని లక్ష్యంగా చేసుకున్నారని ఆమె వెల్లడించారు. ముగ్గురు నలుగురు వ్యక్తులు మాపై దాడి చేశారు. నా భర్తను చంపారు, నన్ను కూడా చంపేయాలని టెర్రరిస్టులతో నేను అన్నాను. వారిలో ఒకడు, నేను నిన్ను చంపను, వెళ్లి మోడీకి ఈ విషయం చెప్పండని అన్నాడు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఒక పోస్ట్‌లో దాడిని ఖండించారు. బాధితులకు కర్ణాటక ప్రభుత్వం నుంచి సాయం చేస్తామని, అండగా నిలుస్తామని అన్నారు.

# ఉగ్రవాదులను వదిలే ప్రసక్తి లేదు

**హోంమంత్రి అమిత్ షాకు మోడీ ఫోన్.. ఘటనను తీవ్రంగా ఖండించిన ప్రధాని, షా**



**నేటి ప్రస్థానం, న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్ర దాడిని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. సౌదీ పర్యటనలో ఉన్న ఆయన.. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడారు. దాడి ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని సూచించిన ప్రధాని.. తక్షణమే ఘటనాస్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించాలని చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు దుశ్చర్యకు పాల్పడ్డారు. అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్‌లోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చిన టూరిస్టులపై కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో ఇప్పటి వరకు భారీగా ప్రాణ నష్టం వాటిల్లింది. అలాగే, అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటనపై సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ ఆరా తీశారు. దాడి గురించిన వివరాలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నుంచి అడిగి తెలుసుకున్నారు. సంఘటన స్థలాన్ని సందర్శించాల్సిందిగా అమిత్ షాకు ప్రధాని మోడీ ఆదేశించారు. ఘటనపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇక, ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని మోడీ.. బైసరన్ లోయలోకి వెళ్లిన పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని తెలిపారు. ఈ దాడికి పాల్పడిన వారిని ఎవరినీ కూడా వదిలి పెట్టమని హెచ్చరించారు. నిందితులను న్యాయస్థానం ముందు నిలబెడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ దాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు ప్రధాన మంత్రి సంతాపాన్ని వ్యక్తం చేశారు. బాధితులకు సాధ్యమైనంత త్వరగా సహాయం అందిస్తామని ప్రధాని మోడీ చెప్పుకొచ్చారు. జమ్ము కాశ్మీర్ లో జరిగిన ఉగ్రదాడి తర్వాత కేంద్రమంత్రి అమిత్ షా తన ఇంట్లో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ మీటింగ్ లో వర్చువల్ గా జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో పాటు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, పోలీసులు, పారామిలిటరీ భద్రతా సంస్థ, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సీనియర్ అధికారులు హాజరయ్యారు. బైసరన్ లోయలో జరిగిన ఉగ్ర దాడి గురించి కీలక అంశాలపై చర్చించారు. పర్యటకులపై దాడి తీవ్రంగా బాధించింది. ఇందులో పాల్గొన్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. నేరస్థులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం. ఘటన గురించి ప్రధాని మోదీకి వివరించాను. సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించాను. అత్యవసర భద్రతా సమీక్ష కోసం శ్రీనగర్ వెళ్తున్నానని కేంద్ర హోంశాఖ మత్రి అమిత్ షా ట్వీట్ చేశారు. పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడిని జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు. దీనిని హేయమైన చర్యగా పేర్కొన్నారు. దాడికి పాల్పడినవారు మానవ మృగాలని, ఘటనను ఖండించేందుకు మాటలు రావడం లేదంటూ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ సుప్రీమ్

**రాష్ట్రపతిని నిర్దేశించే అధికారం సుప్రీంకు లేదు**

**తన వ్యాఖ్యలను సమర్థించుకున్న ఉపరాష్ట్రపతి**

**నేటి ప్రస్థానం, న్యూఢిల్లీ:** చట్టాలు చేయడం, సమస్యలు చర్చించడం ద్వారా పార్లమెంట్ మన ప్రజాస్వామ్యంలో అత్యున్నతమైన సంస్థ అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అన్నారు. అన్నింటికీ పార్లమెంటును మించినది ఏదీ లేదని.. పార్లమెంటే అత్యున్నతమైనదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు రాష్ట్రాల గవర్నర్లు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తొక్కిపెట్టడంపైన ఆగ్రహం వ్యక్తం చేసింది. గవర్నర్లు గానీ, రాష్ట్రపతి గానీ శాసనసభ ఆమోదించిన బిల్లులను నిర్దేశ గడువులోపే పరిశీలించి ఆమోదించాలని తీర్పునిచ్చింది. గవర్నర్ రాష్ట్రపతికి బిల్లులని పంపినా.. మూడు నెలలోపే ఆ బిల్లులను క్లియర్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తమిళనాడుకు చెందిన బిల్లులపై సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలపై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ స్పందించారు. పార్లమెంటే సుప్రీం అని..రాష్ట్రపతి విధులకు సంబంధించి ఆదేశాలు ఇచ్చే అధికారం న్యాయవ్యవస్థకు లేదని వ్యాఖ్యానించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా విమర్శలపై మరోసారి ఆయన స్పందించారు. తాను అన్న వ్యాఖ్యలకు కట్టు-బడి ఉన్నట్లు చెప్పుకొచ్చారు. మంగళవారం ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో జగదీప్ ధన్‌కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుపై తాను చేసిన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలపై స్పందించారు. రాజ్యాంగ వ్యవస్థ ప్రకారం తాను మాట్లాడిన ప్రతి మాట.. అత్యున్నతమైన జాతి ప్రయోజనాలతో చేసిందే అని అన్నారు. పార్లమెంటే అత్యున్నతమైనది.. న్యాయవస్థ 'సూపర్ పార్లమెంట్' పాత్రను పోషించలేదు, కార్యనిర్వాహక వర్గంలోకి ప్రవేశించలేదు అని అన్నారు. ఈ మేరకు దేశ సర్వోన్నత న్యాయస్థానంపై ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు కంటే పార్లమెంటే ఎక్కువ అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పరమైన అంశాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులే అల్టిమేట్ మాస్టర్స్ అని పేర్కొన్నారు. పార్లమెంట్ కంటే అత్యుత్తమమైంది ఉందని రాజ్యాంగంలో ఎక్కడా లేదన్నారు. పార్లమెంటే అన్నింటికీ సుప్రీం అని తేల్చి చెప్పారు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయంలో ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందని గుర్తుచేశారు. ఇటీవల బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వివాదంగా మారింది. నిర్ణీత గడువులోగా రాష్ట్రపతి సమ్మతి తెలపాలని తీర్పు ఇచ్చింది. అంతేకాకుండా వక్ఫ్ చట్టం తదుపరి విచారణ వరకు వాయిదా వేసింది. ఈ నిర్ణయాలే అధికార పెద్దలకు కోపం పుట్టించింది. ఉప రాష్ట్రపతి దగ్గర నుంచి బీజేపీ నేతలంతా సుప్రీం ధర్మాసనంపై విరుచుకు పడుతున్నారు. సుప్రీంకోర్టే ఆదేశాలు ఇస్తే..



ఇక పార్లమెంట్ మూసేసుకోవడం బెటర్ అంటూ ధ్వజమెత్తారు. ఇక బీజేపీ నేతల వ్యాఖ్యలను కాంగ్రెస్ ఖండించింది. సుప్రీంకోర్టును బీజేపీ నేతలు బెదిరిస్తున్నారంటూ ఆరోపించారు.